సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 19 । నవంబర్ । 2024



జీఎంకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: ఇటీవల బదిలీపై వచ్చిన ఆర్జీ–2 ఏరియా జీఎం వెంకటయ్యను మాల సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. నాయకులు పాల్గొన్నారు.



గోదారమ్మకు మహాహారతి

మంథని: స్థానిక గోదావరి తీరంలో గోదారమ్మకు సోమవారం మహాహారతి ఇచ్చారు. హనుమాన్ దీక్ష పీఠాధిపతి సాయిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/17.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం మంచు కురుస్తుంది. పగలు ఉక్కపోతగా, రాత్రి వేళ చలిగా ఉంటుంది.

‘చల్లా’రని మంటలు



కమాన్‌పూర్‌లో పుట్ట మధు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కమాన్‌పూర్ ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- మంథని నియోజకవర్గంలో కొనసాగుతున్న రాజకీయ వేడి
- పుట్ట మధు హత్యకు తనతో కుట్ర చేయించారని బీజేపీ నేత వ్యాఖ్యలు
- మంత్రి పరువుకు భంగం కలిగిస్తున్నారని పోలీసులకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు
- ప్రత్యక్ష ఆందోళనలకు దిగిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతూ చలి వణికిస్తోంది. కానీ, మంథనిలో చల్లా నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ హీటెక్కిస్తున్నాయి. మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబును ఉద్దేశిస్తూ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును హత్య చేయించేందుకు తనను ఉసిగొల్పారని బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి ఇటీవల ఓ వీడియో రిలీజ్ చేయడం, అది సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం ఇందుకు కారణమైంది. సోషల్ మీడియాలో ఇది చక్కర్లు కొడతుండడం రాజకీయ వర్గాల్లోనూ మంటలు పుట్టిస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు పోటాపోటీగా నిరసనలు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు కూడా ఇది వేదికైంది. రెండు పార్టీల శ్రేణులు ఆది, సోమవారాల్లో ఏకంగా ప్రత్యక్ష ఆందోళనలకు దిగడం సంచలనంగా మారింది.

వీడియోలో ఏముంది?

‘నీకు పుట్ట మధు కంట్లో నలుసులా మారిండు. అప్పుడు మనిద్దరం కారులో వెళ్తున్నం.. మంథని గుట్టలు ఎక్కేటప్పుడు మధును ఏదో ఒకటి చెయ్.. ఏమైనా ఐతే నేను చూసుకుంటా అన్నవ్. శ్రీనుబాబు సైతం.. నువ్వే హీరోవు.. వాన్ని ఏదోఒకటి చేసే సత్తా నీకే ఉంది అన్నడు. అనంతరం పుట్ట మధు కనుకునూరుకు వెళుతున్నట్లు సమాచారం ఇచ్చిండు. అప్పుడు నేను స్కూల్ వ్యాన్‌లో 40మందిని తీసుకుని 20 మోటర్ సైకిళ్లు, నాలుగు కార్లలో పోతున్నం. పోతువాయి ఊరు సమీపంలో స్పీడ్ బ్రేకర్ దగ్గర కార్లు ఢీకొన్నయి. అప్పుడు ఎందుకో నాకు జ్ఞానోదయం కలిగింది. కావాలని నన్ను ఈ కేసులో ఇరికించే ప్లానే చేస్తున్నరు. నా రాజకీయ జీవితం నాశనం చేసే ప్లాన్ చేస్తున్నరని తెలుసుకొని వెనుదిరిగిన.’ అని చల్లా నారాయణరెడ్డి ఆ వీడియోలో మాట్లాడినట్లు ఉంది. ఈ వీడియో పెద్దఎత్తున రాజకీయ దుమారం రేపుతోంది.

పోటాపోటీ నిరసనలు.. ఫిర్యాదులు

మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు గౌరవానికి భంగం కలిగిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు మహదేవపూర్, రామగిరి పోలీస్‌స్టేషన్లలో కాటారం పీఏసీఎస్ మాజీ చైర్మన్‌పై ఆదివారం ఫిర్యాదు చేశారు. అంతేకాదు.. కమాన్‌పూర్‌లో కాంగ్రెస్ నేతలు సోమవారం చల్లా నారాయణరెడ్డితోపాటు, వీడియోను ప్రసారం చేసిన యూట్యూబ్ చానెల్ నిర్వాహకుడు పూదరి సత్యనారాయణగౌడ్‌పై ఫిర్యాదు చేశారు. మరోపక్క.. కమాన్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పుట్ట మధు దిష్టిబొమ్మ దహనం చేయగా, దానిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు మంత్రి శ్రీధర్‌బాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. తదనంతరం ఇరు పార్టీల నాయకులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకున్నాయి. మంత్రి గౌరవానికి భంగం కలిగిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు, విచారణ చేపట్టాలని బీఆర్‌ఎస్ శ్రేణులు విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి పేల్చుతున్న మాటల తూటాలు ఎక్కడికి దారితీస్తాయోనని రెండు పార్టీల కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు అందించిన ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

పింఛన్ ఇప్పించండి

వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న. అన్ని అర్హతలు ఉన్నయి. ఇంకా మంజూరు కావడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. మీరైనా చొరవ చూపి పింఛన్ మంజూరు చేయాలి.

– ఆర్నకొండ నర్సయ్య, పెద్దకల్వల

ఆర్‌ఎంపీపై చర్య తీసుకోండి

మా నాన్న రామయ్య అనారోగ్యంతో బాధపడుతుంటే ఆర్‌ఎంపీ వద్దకు తీసుపోయిన. ఇంజక్షన్ ఇస్తే మా నాన్న కాలు స్పర్శపోయింది. నడుస్తలేడు. కరీంనగర్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించిన. ఆర్‌ఎంపీపై చర్య తీసుకోండి.

– శ్రీకాంత్, కనగర్తి

దారి కబ్జా చేశారు..

మా తాతముత్తాల నుంచి ఉన్న దారిని కబ్జా చేసిండ్రు. దారిరి అడ్డంగా గోడ కడుతున్నరు. ఇందుకు బాధ్యులైన వ్యక్తిపై చర్యలు తీసుకోండి. దారి మూసివేతతో 15 కుటుంబాలకు ఇబ్బందులు తలెత్తినయి.

– గ్రామస్తులు, కల్వచర్ల

పథకాలు వర్తింపజేయాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు విద్య, వైద్యం అందించాలి. ఇళ్లు లేనివారిని గుర్తించి పక్కా ఇళ్లను కేటాయించాలి. భూమి లేనివారికి ఎకరం ఇవ్వండి. కుటుంబ పోషణ కోసం ఉపాధి కల్పించండి.

– ధర్మసమాజ్ పార్టీ నాయకులు గణేశ్ తదితరులు

న్యూస్‌రీల్

మెడికల్ ఆఫీసర్లకు అవగాహన



సమావేశంలో డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి

పెద్దపల్లిరూరల్: బాక్టీరియా, వైరస్, ఫంగస్, పరాన్నజీవులు వంటి సూక్ష్మక్రిములతో వచ్చే వ్యాధులు, ఇన్ఫెక్షన్లను నయం చేసేందుకు వినియోగించే మందులను నియంత్రించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అన్న ప్రసన్న కుమారి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు, స్టాఫ్‌నర్సులకు అవగాహన కల్పించారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సమస్య నివారణకు టీకాలు, ఇన్ఫెక్షన్ల నియంత్రణకు స్టివార్డ్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సర్వేలో పొరపాట్లు ఉండొద్దు



సర్వే తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో నరేందర్

పెద్దపల్లిరూరల్: ఇంటింటి సర్వే కార్యక్రమంలో ప్రతీ ఇంటికి వెళ్లి సమగ్రంగా వివరాలను నమోదు చేయాలని జెడ్పీ సీఈవో నరేందర్ సూచించారు. రాఘవాపూర్‌లో చేపట్టిన సర్వే ప్రకియను ఆయన సోమవారం పరిశీలించారు. వివరాల నమోదుపై ఆరా తీశారు. ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల్లేని సింగరేణి లక్ష్యం



సమావేశమైన అధికారులు

గోదావరిఖని: ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం శ్రీనివాస్ సూచించారు. సోమవారం ఆర్జీ–1జీఎం కార్యాలయంలో జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గనుల్లో రక్షణ చర్యలు పటిష్టంగా అమలు పర్చాలన్నారు. ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, ఇంజినీర్ వెంకటేశ్వర్‌రావు, వర్క్‌షాఫ్ డీజీఎం జితేందర్‌సింగ్, సేఫ్టీ ఆఫీసర్ సాయిప్రసాద్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్వింటాలు పత్తి రూ.6,832

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.6,832గా ధర నమోదైంది. కనిష్టంగా రూ.5,958గా, సరాసరి రూ.6,657గా నిర్ధారించామని మార్కెట్‌కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. 285 మంది రైతుల నుంచి 1,123 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

కోల్‌సిటీ(రామగుండం): బల్దియా పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లను డిప్యుటేషన్లపై బదిలీ చేస్తూ సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ బోనగిరి శ్రీనివాస్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నాగభూషణంను మందమర్రికి, సునీల్‌కుమార్‌ను పెద్దపల్లికి, గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎల్.కుమారస్వామిని రామగుండానికి బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. 2021లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 317 జీవో ద్వారా రామగుండం బదిలీపై వచ్చిన నాగభూషణం, సునీల్ కుమార్ మళ్లీ వరంగల్‌కు బదిలీ అవుతామని ఆశపడినా.. తాజా డిప్యుటేషన్ బదిలీ ఉత్తర్వుల్లో ఆ ఆశ నెరవేరలేదు.

నూతన కార్యవర్గం ఖరారు



సీఐ ప్రవీణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఖరారు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా కొలిపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా కొమ్ముగట్టయ్య, సహాయ కార్యదర్శులుగా సురేశ్‌కుమార్, ప్రణయ్, దుర్గాప్రసాద్, అన్వేష్, కోశాధికారిగా ఎండీ జావీద్, కార్యవర్గ సభ్యులుగా మౌనిక, అజయ్, రాజేందర్, రాజు, సురేశ్, విష్ణును ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు రాజాగౌడ్ తెలిపారు.

‘రాష్ట్రంలో దమనకాండ’

గోదావరిఖని: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో దౌర్జన్యం, దమనకాండ కొనసాగుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏది చెబితే పోలీసులు అదే చేస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జలుబు.. దగ్గు.. జ్వరం!

- అకస్మాత్తుగా అనారోగ్యం
- బాధితుల్లో అధికశాతం చిన్నారులే
- వాతావరణ మార్పులే కారణమంటున్న డాక్టర్లు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరుగుతున్న ఓపీ
- కిక్కిరిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: మొన్నటి వరకు ఎండ.. ఇప్పుడు చలి.. అదికూడా పొద్దంతా ఎండ.. రాత్రి పూట చలి.. వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నాలుగు రోజుల క్రితం వరకు 35 డిగ్రీల సెల్సియస్ పగటి ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఒక్కసారిగా 24 డిగ్రీలకు పడిపోయాయి. నాలుగు రోజుల క్రితం రాత్రి ఉష్ణోగ్రతలు 20డిగ్రీల సెల్సియస్ ఉండగా, ప్రస్తుతం 18 డిగ్రీలకు పడిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు అకస్మాత్తుగా అనారోగ్యం పాలవుతున్నారు. జ్వరాలతో ఆసుపత్రుల బాట పడుతున్నారు. పలువురు చిన్నారులు, వృద్ధులు జ్వరం, జలుబు, వాంతులతో బాధపడుతున్నారు. ప్రతీ ఇంటా జ్వర పీడితులు ఉంటున్నారు. వాతావరణ మార్పులు, అపరిశుభ్రతతో జ్వరాలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. జ్వరమే కదా అని కొందరు సొంత వైద్యం చేసుకోవడం.. ఆర్‌ఎంపీల వద్ద చికిత్సలు చేయించుకోవడం.. పరిస్థితి విషమించిన తర్వాత పెద్దాసుపత్రులకు వెళ్లడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జబ్బులు వచ్చాక ఇబ్బంది పడే బదులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా లబ్ధిపొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

రోగులతో కిటకిట..

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. వారం క్రితం వరకు జిల్లా ప్రధానాసుపత్రులతో 700–800 ఓపీ నమోదు కాగా ప్రస్తుతం వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. కొన్ని రోజులుగా 1,500 మందికిపైగా ఓపీలో వైద్యం చేయించుకుంటున్నారు. ఒక్కసారిగా రోగుల సంఖ్య పెరగడంతో వైద్యాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల మొదటి వారంలో అంతంత మాత్రంగానే వచ్చిన రోగులు గత వారం రోజులుగా పెరుగుతూ వస్తున్నారు. ఈనెల 11 నుంచి 18 వరకు పది రోజుల వ్యవధిలోనే కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో ఔట్‌పేషెంట్ విభాగంలో ప్రతీరోజు 1,200–1,500 మంది వరకు వైద్యం పొందారు. ఇందులో చాలా మంది వైరల్ జ్వరాలతోనే వచ్చిన వారుండగా.. మిగిలిన వారు దగ్గు, జలుబు, జ్వరం బాధితులున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో ఓపీలు 15వ తేదీన 708, 16న 1,096, 18న 1,267గా నమోదైంది. జగిత్యాలలో సగటు ఓపీ 700 మంది, సిరిసిల్ల 600 ఓపీ కొనసాగుతోంది.

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో..)

వీర్నపల్లి(సిరిసిల్ల)	12
జూలపల్లి(పెద్దపల్లి)	13.7
గోవిందారం(జగిత్యాల)	13.1
ఆసిఫ్‌నగర్ కొత్తపల్లి(కరీంనగర్)	13

ఈనెల 11వ తేదీ నుంచి కరీంనగర్ జీజీహెచ్‌లో ఓపీ ఇలా..

11	1,529	15	514
12	1,411	16	935
13	1,140	18	1,383
14	1,126		

వాతావరణ మార్పులే



వాతావరణంగా చోటుచేసుకున్న అనూహ్య మార్పులతోనే ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు, వాంతులకు గురవుతున్నారు. వీటిని నిర్లక్ష్యం చేయడం, సరైన సమయంలో చికిత్స అందకపోవడం వల్ల మరింత ప్రమాదకరంగా తయారవుతున్నాయి. మూడు రోజుల కన్నా ఎక్కువ జ్వరం, దగ్గు, జలుబు, వాంతులు ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి చికిత్స పొందాలి.

– డాక్టర్ సాయిని నరేందర్, పల్మనాలజిస్టు, జీజీహెచ్, కరీంనగర్

ముగిసిన గ్రూప్–3 పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో రెండ్రోజుల పాటు నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లావ్యాప్తంగా 8,947 మంది అభ్యర్థుల కోసం 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండోరోజైన సోమవారం మూడో పేపర్ పరీక్ష నిర్వహించగా, 4,514 మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 4,433 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. గ్రూప్ – 3 పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించారని ఆయన వివరించారు.

జ్యోతినగర్‌లో..

జ్యోతినగర్(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 66 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఎన్టీపీసీలోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని ఏసీపీ రమేశ్, సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు చేపట్టామని తెలిపారు.

రెండోరోజూ ప్రశాంతం

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో గ్రూప్ –3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. జిల్లాలో 8,947 మంది అభ్యర్థులకు 18 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నంతోపాటు సోమవారం ఉదయం పరీక్షలు జరిగాయని తెలిపారు. రీజినల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, సీఐ సుబ్బారెడ్డి ఎస్సైలు శ్రవణ్ కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రామగిరిలో..

రామగిరి(మంథని): మంథని జేఎన్‌టీయూలో గ్రూపు– 3 పరీక్షలకు సోమవారం 768 మందికి 281 మంది అభ్యర్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అన్ని వాహనాలను తనిఖీ చేయాలి

- రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్



చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కోటపల్లి మండలం రాపన్‌పల్లి అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి సీపీ సోమవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టులో ఇద్దరు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఆయుధాలతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో అక్రమంగా డబ్బు, మద్యం, బంగారం, ప్రజలను ప్రలోభాలకు గురిచేసే ఇతర విలువైన వస్తువులు తరలిస్తే స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు రూ.4 లక్షల విలువైన మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రవాణా కాకుండా సివిల్ సప్లయి అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారని అన్నారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్సైలు సుబ్బారావు, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇబ్బందుల్లేకుండా పత్తి కొనుగోలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం



రికార్డు తనిఖీ చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రైతులకు ఇబ్బందుల్లేకుండా పత్తి కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. చిన్నకల్వలలోని శ్రీవేంకటేశ్వర జిన్నింగ్ మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. 8శాతం తేమఉన్న పత్తి క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధర లభిస్తుందని, 8 – 12 శాతం వరకు ఉంటే ఒక్కో శాతానికి రూ.75 చొప్పున మద్దతు ధర తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిలా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు డ్రైఫ్రూట్స్

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు డ్రైఫ్రూట్స్, మిఠాయిలు పంపిణీ చేయాలని సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో సోమవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఈమేరకు ఎన్టీపీసీ ఎస్సీసీ సభ్యుడు బాబర్ సలీం పాషా ఈ విషయం తెలిపారు. స్థానిక పరిపాలనా భవనంలో ఈమేరకు సమావేశమయ్యారు. ఎన్టీపీసీ 50 ఏళ్లు, రామగుండం ప్రాజెక్టు 47 ఏళ్ల ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

నిర్మాణాత్మక పరిష్కారం లభించేనా?

- 28న కొత్తగూడెంలో స్ట్రక్చరల్ సమావేశం
- సింగరేణి – గుర్తింపు కార్మిక సంఘం మధ్య సమీక్ష
- దీర్ఘకాలిక సమస్యలపై చర్చించనున్న యాజమాన్యం, నాయకులు
- ఆరేళ్ల తర్వాత తొలిసారి సమావేశం కానున్న ఇరువర్గాలు

గోదావరిఖని: సుదీర్ఘకాలం తర్వాత సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం మధ్య ఈనెల 28న స్ట్రక్చరల్ సమావేశం జరగనుంది. వివిధ సమస్యలపై.. ప్రధానంగా కార్మికుల మారుపేర్ల సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ల సారథ్యంలో వివిధ సమస్యలపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, సింగరేణి యాజమాన్యం మధ్య చర్చలు జరగనున్నాయి.

గతేడాది డిసెంబరులో ఎన్నికలు..

గతేడాది డిసెంబరులో సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా, ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా విజయం సాధించాయి. అయితే గెలిచిన సంఘానికి ధ్రువీకరణపత్రం అందజేయడంలో చాలాజాప్యం జరిగింది. దీంతో సమస్యలపై అధికారికంగా చర్చించే అవకాశం లేకుండా పోయింది. ఎట్టకేలకు గత సెప్టెంబర్ 9న ఏఐటీయూసీకి గుర్తింపుపత్రం అందజేశారు. గెలిచిన సంఘాలు ఎలా వ్యవహరించాలనే అంశంపై గతనెలలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు యాజమాన్యం అవగాహన కల్పించింది. కార్మిక సంఘాల విధులు, బాధ్యతలు, యాజమాన్యం తీరుపై ఇందులో శిక్షణ ఇచ్చారు. అయితే, ఎన్నికలు నిర్వహించిన సుమారు 11 నెలల తర్వాత కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ యాజమాన్యంతో అధికారికంగా చర్చించనుంది.



సింగరేణి కార్మికులు


ఆరేళ్ల తర్వాత తొలి స్ట్రక్చరల్ సమావేశం

సింగరేణిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (బీఆర్‌ఎస్–అనుబంధ) టీబీజీకేఎస్ గుర్తింపు యూనియన్‌గా రెండోసారి గెలిచిన తర్వాత ఒకట్రెండు సమావేశాలు జరిగాయి. ఆ తర్వాత 2018 నుంచి ఇప్పటివరకు స్ట్రక్చరల్ సమావేశాల ఊసేలేకుండా పోయింది. ప్రస్తుతం ఏఐటీయూసీ స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించాలని పట్టుబట్టింది.

గుర్తింపు యూనియన్ ప్రధాన డిమాండ్లు ఇవే..

- సింగరేణి సంస్థ వ్యాప్తంగా సుమారు 500 మంది మారుపేరు కార్మికులు ఉన్నారు.
- వీరి వారసులు అందరికీ వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాలు ఇవ్వాలి.
- గైర్హాజర్ కార్మికులను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద విధుల్లోకి తీసుకోవాలి.
- కోలిండియాలో లేని.. సింగరేణిలో ఉన్న 14 రకాల అలవెన్స్‌లు పెంచాలి
- కార్మికుల ప్రమోషన్ పాలసీ అమలు చేయాలి.
- మైనింగ్ స్టాఫ్, ఈపీ ఆపరేటర్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే సర్ఫేజ్‌లో సేమ్ జాబ్ ఇవ్వాలి.
- ట్రేడ్స్‌మెన్లకు గనిలో పనిచేసే పరిధి నిర్ధారించాలి.
- సొంతింటి కల, పెర్క్స్‌పై అలవెన్స్ వచ్చేనెలలో సీఎండీతో జరిగే సమావేశంలో చర్చించాలి.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్ట్రక్చరల్ సమావేశంలో చర్చిస్తాం. ఆరేళ్ల తర్వాత తొలిసారిగా జరిగే సమావేశంలో అన్ని అంశాలపై డైరెక్టర్లతో చర్చిస్తాం. వచ్చేనెలలో జరిగే సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశంలోనూ కార్మికుల సొంతింటి కల, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మాఫీ అంశాలపై చర్చిస్తాం. కార్మికుల రక్షణ, సంక్షేమం, మరిన్ని భూగర్భ గనుల తవ్వకం మా లక్ష్యం.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

క్లుప్తంగా

కొండముచ్చుకు విముక్తి

- పెటా ఫిర్యాదుతో వెలుగులోకి

కరీంనగర్ అర్బన్: బంధీఅయిన కొండముచ్చుకు పెటా ఫిర్యాదుతో విముక్తి లభించింది. రామడుగు మండలం తిర్మలాపూర్‌లో ఓ వ్యక్తి కొండముచ్చును బంధించాడు. కొన్నేళ్లుగా సాగుతుండగా పెటా ఇండియా ప్రతినిధులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఈక్రమంలో కరీంనగర్ ఎఫ్ఆర్‌వో శౌకత్ హుస్సేన్ తన బృందంతో దాడిచేసి పట్టుకున్నారు. బంధించిన వ్యక్తికి జరిమానా విధించినట్లు తెలిపారు. మూగజీవాలను బంధించడం నేరమని, చట్ట ప్రకారం లక్ష జరిమానాతో పాటు మూడేళ్ల శిక్ష ఉంటుందని పెటా ఇండియా ప్రతినిధులు హిరాజ్ లాల్‌జని, సంస్కృతి బన్సోర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నర్సయ్య(ఫైల్)

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామానికి చెందిన జూపాక నర్సయ్య (63) రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సయ్య ఆదివారం సాయంత్రం భూషణరావుపేట శివారు మర్రివ్వ దేవాలయం వద్ద భోజనానికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. భూషణరావుపేట శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నర్సయ్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నర్సయ్య కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిప్పంటుకుని వృద్ధురాలు..

- అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసిన కూతురు


పోశమ్మ(ఫైల్)

మానకొండూర్: మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన బొడ్డు పోశమ్మ (85) నిప్పంటుకొని చికిత్స పొందుతూ మృతిచెందింది. కాగా.. తన తల్లి మృతిపై అనుమానాలు ఉన్నాయని కూతు రు అలువాల లచ్చవ్వ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన బొడ్డు పోశవ్వకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. అందరి పెళ్లీలు అయ్యాయి. ఈమె భర్త ఉప్పలయ్య 17 ఏళ్ల క్రితం మృతిచెందాడు. పదేళ్లక్రితం కుమారుడు చంద్రయ్య ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కోడలు బొడ్డు ఎలవ్వతో కలిసి వృద్ధురాలు ఉంటోంది. మూడు నెలల క్రితం ఇంట్లో పోశవ్వ పడిపోగా తొంటి విరిగి మంచానికే పరిమితం అయ్యింది. ఆదివారం సాయంత్రం కోడలు ఎల్లవ్వ కరీంనగర్ నుంచి ఇంటికి వచ్చే సరికి మంచంపై పోశవ్వ శరీర బాగాలకు కాలిన గాయాలతో ప్రాణప్రాయస్థితిలో పడి ఉంది. దీంతో కోడలు వెంటనే అత్తను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే తన తల్లి మృతిపై అనుమానాం ఉందని.. విచా రణ జరిపి న్యాయం చేయాలని కూతురు అలు వాల లచ్చవ్వ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దశదిన కర్మకు వస్తూ..

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన అరికిల్ల నర్సమ్మ(55) స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం రైలు కింద పడి మృతిచెందింది. ఆమె భర్త నర్సయ్య కథనం ప్రకారం.. ఓదెలలోని కొంత్ర రాంచంద్రం ఇంట్లో జరిగే దశదినకర్మకు హాజరయ్యేందుకు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ రైలుఎక్కారు. ఓదెల స్టేషన్‌లో రైలు ఆగే సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారిపడి కిందపడింది. దీంతో వృద్ధురాలి రెండుకాళ్లు తెగిపోయాయి. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెకు ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలాన్ని రామగుండం జీఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి సందర్శించి కేసు నమోదు చేసుకొన్నారు.


ఈ చిత్రం సిరిసిల్ల మున్సిపల్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ దుస్థితి. వ్యాపారులు ఇలా ఫుట్‌పాత్‌పై మెగాసేల్స్ అంటూ ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ సామగ్రిని నింపారు. మున్సిపల్ సాక్షిగా సాగుతున్న ఈ తంతును అధికారులు చూసీచూడనట్లు వదిలేయడం ప్రశ్నార్థకంగా మారింది.


పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఫుట్‌పాత్ ఇదీ. రద్దీగా ఉండే రోడ్డువెంట నడుచుకుంటూ వెళ్తూ చాలామంది ప్రమాదాలకు గురయ్యారు. నగరపాలక సంస్థ ఫుట్‌పాత్‌లు నిర్మించినా ఇలా పలువురు చిరువ్యాపారులు ఆక్రమిస్తుండడంతో రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది.


ఈ చిత్రం సిరిసిల్ల విమల్ థియేటర్ ఏరియాలోనిది. నిత్యం బిజీగా ఉంటుంది. పైగా ఇరుకైన రోడ్డు. ఇక్కడి దుకాణదారులు ఎంచక్కా మున్సిపల్ ఫుట్‌పాత్‌ను ఇలా కబ్జా చేస్తున్నారు. దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయినా పట్టించుకునేవారు కరువయ్యారని ప్రజలు అంటున్నారు.

సాక్షి ఫోకస్

పాదచారి.. ఏది దారి?

బల్దియా నిర్లక్ష్యం.. పాదచారులకు శాపంగా మారింది. జిల్లాకేంద్రాల్లో జనం నడవడానికి దారిలేకుండా పోయింది. వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించడంతో నడక నరకంగా మారింది. రోడ్లపై ట్రాఫిక్ పెరిగి కనీసం ద్విచక్రవాహనదారులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పట్టణాల్లో నలువైపుల గల ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడంతో జనానికి ఇబ్బందిగా మారింది. అంతేకాదు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలబారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం షరా 'మామూలు'గా తీసుకుంటున్నారు.

– కరీంనగర్ కార్పొరేషన్/జగిత్యాల/పెద్దపల్లి రూరల్/సిరిసిల్ల టౌన్/కోల్‌సిటీ


ఈ చిత్రంలోని ప్రాంతం జగిత్యాల టవర్ సర్కిల్‌లో ప్రధానమైన వ్యాపార సముదాయం. ఇక్కడకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. కానీ నడిరోడ్డుపైనే బైక్‌లు పార్కింగ్ చేస్తున్నారు. నడిచేందుకు స్థలం లేకుండా ఆక్రమించేశారు.


కరీంనగర్‌లోని మార్కెట్ ఏరియా ఇది. వేలాదిమంది రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల స్మార్ట్‌సిటీ సుందరీకరణలో భాగంగా నిర్మించిన ఫుట్‌పాత్‌లను దుకాణదారులు ఆక్రమిస్తున్నారు. కనీసం నడిచేందుకు దారి లేకుండా ఇలా సామగ్రితో నింపేస్తున్నారు. నగరంలోని దాదాపు అన్నిచోట్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తుండగా నగరపాలక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.


కరీంనగర్‌లోని డాక్టర్ స్ట్రీట్‌లో పరిస్థితి ఇదీ. కొందరు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఇలా పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పలు ఆస్పత్రుల యాజమాన్యం, షాపింగ్ మాల్స్ నిర్వాహకులు ఇలా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని పార్కింగ్ అడ్డాలుగా మార్చుకుంటున్నా.. పోలీసులు, బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు.

గంజాయి కేసులో నలుగురికి ఐదేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: గంజాయి కేసులో నలుగురికి ఐదేళ్ల జైలుతోపాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నవంబర్ 10, 2020న నగరంలోని జ్యోతినగర్‌లో ఎర్రోళ్ల రమేశ్, అన్నం కృష్ణ, జాడి అజెయ్, దుర్గం శ్రీధర్, మడికెట్టి రాజ్‌కుమార్ గంజాయి విక్రయించేందుకు వచ్చి అనుమానస్పదంగా తిరుగుతున్నారు. అదే వారిని కరీంనగర్ టూటౌన్ పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద నాలుగు కిలోల గంజాయి లభించింది. పోలీసులు సుమోటో కేసు నమోదు చేశారు. అప్పటి టూటౌన్ సీఐ టి.లక్ష్మీబాబు కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శరత్ సాక్ష్యాలను ప్రవేశపెట్టి విచారించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నలుగురు నిందితులు రమేశ్, కృష్ణ, శ్రీధర్, రాజ్‌కుమార్‌కు ఐదేళ్ల జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కేసు విచారణ నడుస్తుండగా అజెయ్ మృతిచెందాడు.

కూతురు వద్దకని వెళ్లి తప్పిపోయిన రైతు

- పదిహేను రోజులకు ఆచూకీ లభ్యం
- హైదరాబాద్‌లో పట్టుకున్న పోలీసులు
- కుటుంబసభ్యులకు అప్పగింత



మల్లయ్యను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పొలం పనులకు వెళ్లి ఇంటికి రాకుండా కనిపించకుండా పోయిన రైతు పదకొండు రోజులకు హైదరాబాద్‌లో పోలీసులకు దొరికాడు. ముస్తాబాద్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన ఈరుగు మల్లయ్య ఈనెల 7న ఇంట్లోంచి పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం వరకు భోజనానికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో కూడా ఆచూకీ లభించలేదు. ఈనెల 11న ముస్తాబాద్ ఎస్సై గణేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్, సిద్దిపేట, కామారెడ్డి, సిరిసిల్ల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. మల్లయ్య వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో, ఆయన ఫొటోను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించారు. తెలిసిన వారి ద్వారా గాలింపు చేపట్టగా హైదరాబాద్‌లో కనుగొన్నారు. హైదరాబాద్‌లో ఉన్న కూతురు వద్దకు మల్లయ్య వెళ్లగా, అక్కడ తప్పిపోయినట్లు పోలీసులకు తెలిపాడు. దాదాపు పక్షం రోజులపాటు మల్లయ్య హైదరాబాద్‌లోనే ఆగమై తిరిగాడు. పోలీసులు మల్లయ్యను సోమవారం ముస్తాబాద్ ఠాణాకు తరలించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. పదిహేను రోజుల తర్వాత ఆచూకీ లభించడంతో కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆకట్టుకున్న 'అల్ఫోర్స్ ఎడ్యూ ఎగ్జిబిషన్'


ప్రదర్శనను తిలకిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన »అల్ఫోర్స్ ఎడ్యూ ఎగ్జిబిషన్« ఆకట్టుకుంది. వార్షిక ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లిక్విడ్, డెన్సిటీ, హైడ్రోఫ్యూయల్ జనరేటర్, ప్లాస్టిక్ నిర్వహణ, ఆమ్ల వర్షం, బోర్స్ మోడల్, బొగ్గు తయారీ నీటి శుద్ధి యంత్రం, పిర్యాడిక్ టేబుల్, ట్రిపీజియం, గణిత్ వరల్డ్, వరల్డ్ ఆఫ్ మ్యాథ్స్ తదితర నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేందుకు, ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రాజన్నకు 'కార్తీక' రద్దీ

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక సందడి కొనసాగుతోంది. స్వామివారికి ప్రతీకరమైన కార్తీక సోమవారం రోజున దర్శనానికి భక్తులు బారులు తీరారు. వివిధ ప్రాంతల నుంచి తరలివచ్చి ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, చల్లంగచూడు రాజన్న అంటూ వేడుకున్నారు.

కార్తీక దీపోత్సవం

రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం సందర్భంగా కళావేదిక ప్రాంగణంలో సంగీత నిలయ విద్వాంసుడు కొంటికర్ల రామయ్య శర్మ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీరామ్ బట్టర్ హరికథ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.




వివాహం ఇష్టంలేక యువతి ఆత్మహత్య


కాల్వ సంధ్య(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): కటికెనపల్లి గ్రామానికి చెందిన కాల్వ సంధ్య(22) వివాహం ఇష్టం లేక ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఉన్నత చదువులు చదువుకోవాలని సంధ్య తల్లిదండ్రులకు చెప్పినా వినలేదని, మంచి సంబంధం వచ్చిందని పెళ్లి చేసుకున్నా.. ఆ తర్వాత చదువుకోవచ్చని తల్లిదండ్రులు ఆమెను ఒప్పించే ప్రయత్నం చేశారని ఎస్సై పేర్కొన్నారు. ఇటీవల పెళ్లి కూడా నిశ్చయించారన్నారు. వివాహం చేసుకోవడం ఇష్టం లేని సంధ్య చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తండ్రి కాల్వ కనుకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరీంనగర్‌లో న్యాయవాది..

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లో నోటరీ అడ్వకేట్ ఒకరు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కరీంనగర్ త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ వావిలాలపల్లిలో నివాసం ఉంటున్న అర్ష నిరంజన్(50) నోటరీ అడ్వకేట్‌గా పనిచేస్తున్నాడు. గత ఏడాది నిరంజన్ పెద్ద కూతురు ప్రేమ వివాహం చేసుకొని ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి నిరంజన్ మనోవేదనతో తాగుడుకు బానిసయ్యాడు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆదివారం భార్య గ్రూప్–3 పరీక్ష రాసేందుకు వరంగల్‌కు వెళ్లింది. ఒంటరిగా ఉన్న నిరంజన్ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. సోమవారం ఉదయం ఇంటి ఓనర్ చూసేసరికి ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పెద్దపల్లిలో..


సూర్రెడ్డి ప్రసాద్‌రెడ్డి(ఫైల్)

పెద్దపల్లిరూరల్: స్థానిక బస్టాండ్ ప్రాంతంలో సోమవారం సూర్రెడ్డి ప్రసాద్‌రెడ్డి(52) ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రసాద్‌రెడ్డి కొంతకాలంగా కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఓ శుభకార్యానికి భార్య రమాదేవితో కలిసి ఇక్కడకు వచ్చాడు. భార్య రమాదేవి పుట్టింటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న ప్రసాద్‌రెడ్డి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతుడికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. ఘటనాస్థలాన్ని ఏఎస్సై రామస్వామి సందర్శించారు. ఆత్మహత్యకు పాల్పడేందుకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

బార్‌దాన్ ఇవ్వడంలేదని రైతుల ఆందోళన


వెన్నంపల్లి సహకార సంఘం ఎదుట బార్దాన్, గడ్డి కట్టలు దహనం చేసి నిరసన తెలుపుతున్న రైతులు

సైదాపూర్(హుజూరాబాద్): మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లో బార్‌దాన్ ఇవ్వడం లేదని సోమవారం రైతులు ఆందోళన చేశారు. నెల రోజుల నుంచి బార్‌దాన్ ఇవ్వడంలేదని సహకార సంఘం ఎదుట గడ్డి కట్టలకు నిప్పంటించి ఆందోళన చేశారు. ధాన్యంతో రూ.లక్షల్లో కమీషన్లు దండుకుంటూ బార్‌దాన్ ఇవ్వకుండా రైతులను అరిగోస పెడుతున్నారని రైతు కంది రవీందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులతోనే లబ్ధిపొందుతున్న సంఘం కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌళిక వసతులు, అవసరాలు తీర్చడం లేదని, రైతుల డబ్బులతో కోట్లు వెచ్చించి భవనాలు కడుతున్నారని, పాలకవర్గం, సిబ్బంది రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. బార్దాన్,హమాలీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని చైర్మన్ వెంకటరెడ్డి రైతులకు హామీ ఇచ్చారు.

ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ


ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో కలిసి మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- బీజేపీ, బీఆర్‌ఎస్ నేతల తీరు ఇదీ
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

గోదావరిఖని: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల తీరు ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలా ఉందని రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా రాజురా నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్తూ మార్గమధ్యంలో రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద మంత్రి కాసేపు మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ బిల్లుల ఆమోదానికి బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీకి మద్దతిచ్చిందన్నారు. నోట్ల రద్దు, రైతువ్యతిరేక చట్టాలు, జీఎస్టీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు బీజేపీకి మద్దతు పలికింది బీఆర్‌ఎస్ అని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై విచారణ కమిషన్ విచారణ చేస్తోందని తెలిపారు. వీటన్నిటికీ భయపడి బీజేపీని బీఆర్‌ఎస్ నాయకులు శరణు కోరుతున్నారని విమర్శించారు. తమకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ అని, ఆ పార్టీతో ఎలా కలిసి పనిచేస్తామని ప్రశ్నించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, అక్కడ కాంగ్రెస్ అలయెన్స్ ప్రభుత్వం ఏర్పడబోతోందని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దని కేటీఆర్ అంటున్నారని, అంటే బీజేపీకి ఓటు వేయాలని పరోక్షంగా చెప్పినట్లేనా? అని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. బీజేపీకి దోస్తీ తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ అని అన్నారు. గత పదేళ్ల పాలనలో బీజేపీకి మద్దతు పలికిన తెలంగాణ ద్రోహులు మీరుకాదా అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌తో దోస్తీ చేస్తోందని బండి సంజయ్ అంటున్నారన్నారని, ఇది ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఏటీఎంలా మారిందని చెప్పిన బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులను ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీశారు. రెండుపార్టీలది ఒకేబాణి, ఒకే వాణి అన్నారు. ఈనెల 19న వరంగల్‌లో ఇందిరా మహిళా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం రూ.ఏడున్నర లక్షల కోట్ల అప్పు ఉన్నా.. పరిపాలనా దక్షతతో ముందుకు సాగుతూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు దీటి బాలరాజు, పాతిపెల్లి ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

కేశోరాం సిమెంట్ పరిశ్రమలో సమ్మె సైరన్

- రూ.52వేలు బోనస్ చెల్లించాలని డిమాండ్


మాట్లాడుతున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి

పాలకుర్తి(రామగుండం): తమకు రూ.52వేల బోనస్ చెల్లించాలనే డిమాండ్‌తో పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందజేశారు. దీపావళి పండుగ బోనస్ విషయంపై కొద్దిరోజులుగా చర్చలు సాగుతున్నాయి. గతేడాది కన్నా 20 నుంచి 30శాతం అదనంగా బోనస్ చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇవేమీ పట్టించుకోని యాజమాన్యం పండుగకు ముందు కార్మికుల బ్యాంకు అకౌంట్లలో రూ.16,800 చొప్పున బోనస్ జమచేసింది. దీనికి నిరసనగా పర్మినెంట్ కార్మికసంఘం నాయకులు దాదాపు పదిరోజుల పాటు రిలేనిరాహార దీక్ష చేపట్టారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చొరవతో స్థానిక అధికారులు స్పందించారు. ఈనెల 15న ఉన్నతాధికారులతో బోనస్‌పై చర్చిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పర్మినెంట్ కార్మికసంఘం నాయకులు దీక్ష విరమించారు. మరోవైపు.. కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు కౌశిక హరి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు కంపెనీ గేట్ ఎదుట విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. మళ్లీ స్పందించిన అధికారులు.. రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా చర్చలు జరపలేదు. మూడ్రోజుల క్రితం పర్మినెంట్ కార్మికులకు రూ.15వేలు, కాంట్రాక్ట్ బేసిక్ కార్మికులకు రూ.12వేలు, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.10వేల చొప్పున వారి బ్యాంకు అకౌంట్లలో యాజమాన్యం బోనస్ జమచేసింది. ఈనేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు కౌశిక హరి కంపెనీ ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ పార్థసారథితో సోమవారం మరోసారి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో రూ.52వేల బోనస్ చెల్లించేందుకు యాజమాన్యం సానుకూలంగా లేదని వారు తేల్చి చెప్పడంతో కార్మిక సంఘం నేతలు సమ్మెకు పిలుపునిచ్చారు. కౌశికహరి మాట్లాడుతూ మంగళవారం కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేస్తారన్నారు. బుధవారం నుంచి టూల్‌డౌన్ సమ్మె చేస్తామని, అవసరమైతే విధులను బహిష్కరించి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈచర్చల్లో కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, నాయకులు బత్తిని సతీశ్, పెరుమాండ్ల రమేశ్, తీగల తిరుపతి, స్వామి, సాధిఖ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి వద్దగల గోదావరిలో గంగాహారతి కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా దేవాలయం నుంచి నది వద్దకు మంగళవాయిద్యాలతో బయల్దేరి వెళ్లారు. గోదావరిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఊరేగింపు సేవ నిర్వహించారు.

ఆలయానికి ఒక్కరోజు ఆదాయం 3.05 లక్షలు

శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి సోమవారం ఒక్కరోజే రూ.3.05లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు.